# ద్వంద్వ సమాసం

## —మధురాంతకం రాజారాం

**ఒక** శాశ్వతమైన విలువను ఎద్దేవా చెయ్యడం కోసం నే నీ కథ చెబుతున్నానని ఎవరైనా అనుకుంటే, 'మన్నించండి, బాబూ' అంటూ లెంపలేసుకోవడం మినహాగా నాకు గత్యంతరం లేదు. నేను పది పదిహేనేళ్ళుగా పిల్లలతో వేగుతున్నదాన్ని. భగవంతుని సృష్టిలో ఏ వస్తువూ ఇంకొక వస్తువుకు అసలు సిసలు డిటోగా ఉండదంటారు. పిల్లలున్నా అంతే. ఆకారంలో మాత్రమేగాదు. ప్రవర్తనను బట్టి చూచినా, తెలివితేటల్నిబట్టి చూచినా ఎవరికి వారే ప్రత్యేకం! రెక్కలొచ్చిన పక్షులు గాలిలో ఎగిరిపోయినంత సహజంగా, సులభంగా కొందరు పిల్లలు చదువుల్లోకి చొచ్చుకపోతారు. అదొక సాంప్రదాయంగనుక బడికొస్తున్నారేగానీ, వీళ్ళింటి దగ్గరే ఉండి టీచర్‌తో అవసరం లేకుండానే చదువుకోగల రనిపిస్తుంది. మరికొందరికి చదువుపైన శ్రద్ధ ఉన్నట్లే తోచదు. ఎప్పుడూ పరధ్యానంగా ఉన్నట్లే కనిపిస్తారు. కానీ, ఎప్పు డే ప్రశ్న అడిగినా టకమని సమాధానం చెప్పేస్తూ వీళ్ళు టీచర్ కాశ్చర్యం కలిగిస్తారు. కొందరికి పాపం, బాగా చదువుకోవాలనే ఉంటుంది. రాత్రంతా కంఠోపాఠం చేసి ఉదయం ఒప్పగిస్తారుగూడా! కానీమరునాటికల్లా అంతా మరిచిపోతారు. కొందరెట్లాగో తంటాలు పడి అత్తెసరు మార్కులతో పాసవుతారు. మరి కొందరికి చదివే వోపరికం బొత్తిగా ఉండదు. కానీ మార్కులతో బాటు, మిగిలిన కితాబులన్నీ గూడా తమకే కావాలని ఉంటుంది. విద్యా బోధకులైనవారు పిల్లల మనస్తత్వాన్నిబట్టి, విషయగ్రహణ శక్తినిబట్టి ఒక్కొక్క విద్యార్థితో ఒక్కొక్కరకంగా వ్యవహరించ వలసి ఉంటుందని నేను అనుభవంవల్ల తెలుసు కున్నాను. అంతకుమించి విద్యార్థి కుటుంబం, సమాజంలో దానికున్న పలుకుబడి, కులం, మతం వర్గం మొదలైన మీమాంసలు టీచరుకు బొత్తిగా అక్కరలేనివని నా నమ్మకం. నా ఉద్యోగ నిర్వహణ కంతా ప్రాణభూతమైన ఈ నమ్మకాన్ని నమ్ముకుని చేస్తూ ఒకానొక నాటి ఉదయం ఒక తుఫాను మా స్కూల్లో ప్రవేశించింది.

ఆడ పిల్లల పాఠశాలగదా! ఆ వచ్చిన తుఫాను గూడా ఒక స్త్రీ రూపంలోనే వచ్చింది. వాలకాన్ని బట్టి చూస్తే ఒక పెళ్ళికి వెళ్తూ వెళ్తూ మార్గ మధ్యంలో ఆవిడ ఈ బడిలో దిగేసినట్లుంది. కట్టుకున్న పట్టు చీర సంపన్నతకు గుర్తు. అది ముదురు ఆకుపచ్చరంగులో ఉండడం అభిరుచుల తీవ్రతకు దాఖలా. పువ్వులూ, మొగ్గలూ ఆ చీరపైన క్రిక్కిరిసి ఉండడం సాదాతనంపట్ల ఆమెకుగల వైముఖ్యానికి సూచన. ఇంక నగల విగారింపు సంగతి చెప్పనే అక్కర్లేదు! మొత్తంపైన తనను గురించి ఇంకొకరు పరిచయం చేయవలసిన అవసరం లేకుండా, తన వేషమే ఆ పనిని చేయగలిగేటట్టు ఆమె జాగ్రత్త తీసుకున్నదని మాత్రం ఒప్పుకోవాలి. ఆ ఉద్దేశం నిరాఘాటంగా నెరవేరినట్లే ఉంది. అందుకు నిదర్శనం ఇంటర్వెల్ సమయంలో స్టాఫ్‌రూంలో అడుగుపెట్టే సరికి నాకు కానవచ్చిన సంచలనం.

"కంట్రాక్టరు చంద్రారావుగారంటే తెలియదా? మునిసిపాలిటీ పనులన్నీ చేయిస్తుంటారు. ఈమధ్య పార్కు దగ్గర వాటరు టాంకు కట్టించిందిగూడా ఆయనే!"

"తెలుసులేవే, హేమా! ఆ టాంకు అడుగుభాగం నీళ్ళు జల్లిస్తోందట. చంద్రారావుగారు టాంకులు నిర్మించడంకన్నా, జల్లెడలు తయారు చేసి అమ్ముకోడం మంచిదని మన వూరి పత్రికలో వ్యాసం వచ్చింది గూడా!"

"ఆ చంద్రారావుగారి భార్యే ఆవిడ! లేడీస్ క్లబ్బులో యాక్టివ్ మెంబరు. . ."

"మరైతే ఈమె దారి తప్పి ఇలా ఎందుకొచ్చి ఉంటుందబ్బా?"

"దారితప్పికాదులే! వా ళ్ళమ్మాయి నాలుగో క్లాసులో ఉందిగా!"

"అలాగా, అలాగా" అన్న బృందగానంతో చాటుగా అందరి కళ్ళూ నావైపు తిరిగాయి.

"ఏమమ్మా జానకీ! చంద్రారావుగారి అమ్మాయి పైన నోరుగానీ, చెయ్యిగానీ చేసుకున్నావా ఏమిటి? మిసెస్ చంద్రారావు అకారణంగా ఎందుకొస్తుంది? ఏదో పనిమీదనే వచ్చి ఉంటుంది. ఎవరి పనో పట్టడానికే వచ్చి ఉటుంది. . ."

అబ్బే, నే నెవరినీ కొట్టలేదే! కనీసం తిట్టనుగూడా లేదే! అన్న జవాబుకోసం మా పంతులమ్మలందరూ వేచి ఉన్నట్టే తోచింది. పెదవి కదలకుండానేను మౌనం వహించడంవల్ల వాళ్ళ అనుమానం మరింతగా బలపడి ఉండవచ్చు గూడా! నిజానికి నా క్లాసులో ఉన్న నలభై మంది పిల్లల్లో కంట్రాక్టరు చంద్రారావుగారి కూతురెవరో నాకు తెలియదు. కొట్టడం, తిట్టడంలాంటి తీవ్రచర్యలు గాకపోయినా, అవసరమైనప్పుడు ఏ అమ్మాయినైనా కాస్త మందలించి ఉండడం సంభవమే! కానీ, ఆమాత్రానికి ఒక తల్లి పనిగట్టుకుని బడిపైకొస్తుందా?

ఏమిటోమరి! నా ఆలోచనలో నేనుండగానే—"జానకమ్మగారూ! మిమ్మల్నొకసారి హెచ్.ఎం.గారు ఆఫీసు రూముదాకా రమ్మంటున్నారండీ!" అంటూ ఆయా సుబ్బులమ్మ బిరబిరా గది లోపలికి వచ్చేసింది.

'చూచావా! మే మనుకున్నంతా అయింది. ఇక నువ్వు తొక్కిన అడుసును ను వ్వెలా కడుక్కుంటావో కడుక్కో' అన్నట్టుగా తోడి ఉపాధ్యాయినుల చూపులన్నీ ఒక్కుమ్మడిగా నాపైన మూగి, సానుభూతి పలుకసాగాయి.

అయితే, ఈ పరిస్థితిలో బేలముఖం పెట్టి బెంబేలు పడవలసిన అవసరం నాకేమీ కనిపించలేదు. మిసెస్ చంద్రారావు సమాజంలో గొప్ప స్టాటస్ గలిగిన ఇల్లాలే కావచ్చు. కాని, ఆవిడ సింహంకాదు గదా! పులిలా పైనబడి తినేయలేదుగదా! సహేతుకమైన ఏ ఆరోపణకైనా స్వాగతమే! నిర్హేతుకంగా మాటలు మీరితే వూరుకోవడం నాచేత గాదు. అయినా జరగని పెళ్ళికి ఇప్పటినుంచే మేళాలెందుకు? వీలయినంత నింపాదిగా ఆఫీస్ రూంలో ప్రవేశించాను. తీరా అక్కడ అడుగు పెట్టేసరికి అనవసరంగా లేనిపోని అపోహలు కలిగించుకున్నానేమోనని నేను కొంచెం కించపాటుకు లోనుగాక తప్పిందిగాదు. నా అంచనాకు విరుద్ధంగా అక్కడి వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా ఉండడమే అందుకు కారణం!

"రావమ్మా, జానకీ! కూచో. . ."హెడ్‌మేస్ట్రెస్ మిస్ దేవసేనగారు సాదరంగా పిలిచి కుర్చీ చూపెట్టింది. "వీరిని తెలీదటమ్మా! శ్రీమతి రమాబాయిచంద్రా





రావుగారు. సోషల్ యాక్టివిటీస్‌లో ఎప్పుడూ ముందుంటారు. . ."

"నమస్కారమండీ!" అన్నాను.

అప్పు చెల్లించడానికి తొందరపడుతున్నట్లుగా అసలుతో వడ్డీగూడా కలిపి—"నమస్తే, నమస్తే" అంది రమాబాయి.

మళ్ళీ నన్నే ఉద్దేశించి కొనసాగించింది హెడ్ మిస్ట్రెస్‌గారు— "సముద్రం పొంగుతుంది. భూకంపాలొస్తాయి. అగ్ని ప్రమాదాలు జరుగుతాయి. అలాంటి అవాంతరా లొచ్చినప్పుడలా రంగంలోకి దూకి దీనుల్ని ఆదుకోవడంలో రమాబాయిగారు ఫస్టు!. . .అన్నట్టు, రమాబాయిగారూ! ప్రస్తుతం మీ యాక్టివిటీ ఏమిటండీ?"

"మురికివాడల్లో పాపలకు దుస్తులు, పాలపొడి డబ్బాలు పంచిపెడుతున్నాం. అదైనా మంచి ఎక్స్‌పీరియన్సే! ఇటీవలి కాలంలో టౌనుకన్నా దీనిచుట్టూ మురికివాడలే బాగా బలిసిపోయినట్లున్నాయి. మూరెడెత్తు పుట్టి గోడలపైన పెద్ద బుట్ట ఒకటి బోర్లించినట్టుగా ఆవేం ఇళ్ళో మన కర్థంగావు. అంతకన్నా చెట్ల తొర్రలు, కొండ గుహలే నయం! ఆ గుడిసెలో జీవిస్తున్నది మనుషులేనంటే నమ్మడం కష్టం. రొంపీ, రొచ్చూ, చెత్తా, చెదారం, ఈగలూ దోమలూ, కుక్కలూ పందులూ. . .అబ్బబ్బ, ఆ దుర్గంధాన్ని భరించలేము. వీలయినంత తొందరగా బయటపడాలనే ఉంటుంది. వాళ్ళు తెమలనివ్వరే! ఉదయం పదిగంటల కొస్తున్నట్టుగా చెప్పి పంపుతామనుకోండి! వాళ్ళు ఉదయం ఎనిమిది గంటలకల్లా మనకోసం హాజరైపోతారు. తమ బిడ్డలకు బొత్తిగా బట్టల్లేవని మనకు తెలియాలి గదా! అందుకని వాళ్ళని చింకిపేలికల్లో చుట్టి తీసుకొస్తారు. 'బిడ్డలందరికీ దుస్తులిస్తున్నాం, క్యూలో నిల్చోండి' అంటే వినరే! ఒకరిపైన ఒకరు పడుతూ లేస్తూ, మోదుకుంటూ, 'అమ్మా, 'తల్లీ! దయజూడమ్మా! నా బిడ్డకయితే పుట్టింది మొదలు చొక్కా తొడగలేదమ్మా' అంటూ గింజుకుంటారు. ఇంతకన్నా కనా కష్టం పనులున్నాయండీ వాళ్ళల్లో మనం పాలపొడి డబ్బాలిస్తున్నాంగదా! వాళ్ళు వాటిని తీసుకెళ్ళి బజార్లో అమ్ముకుంటారట! వ్యవహారం ఎంత నాస్టీగా ఉందో చూశారా! ఏమిటోలెండి! ఈ దేశాన్ని బాగు చెయ్యడం సాధ్యమేనా అనిపిస్తూ ఉంటుంది ఒక్కొక్కప్పుడు. . ."

"అయినా, ఎంత వోపికండీ మీకు! ఎప్పుడూ ఏదో ఒక పని పెట్టుకుంటూ ఉంటారు. మాబోటి వాళ్ళకు మిమ్మల్ని చూస్తే ఎంత అసూయగా ఉంటుందో చెప్పలేను. . ."

దేవసేనగారి మంత్రం రమాబాయిపైన బాగా పని చేసింది.

"మా ఇంటికంతా ఈ తెగులు పట్టింది నా కొక్కదానికేనండీ! మా పెద్దన్నయ్య సింగరేణిలో పెద్ద ఆఫీసరు. మా పెద్దక్కయ్య ఆర్మీ డాక్టర్‌ను పెళ్ళాడి ఆగ్రా దగ్గర సెటిలైపోయింది. మా చిన్నక్క నిచ్చింది బెంగుళూరు. అక్కడ మా చిన్న బావ. . ."

రమాబాయి వాగ్ధార అంతకంతకూ ఉప్పొంగి ఒక ప్రవాహంగా మారబోయే ప్రమాదాన్ని నేను శంకించాను. ఆ ప్రవాహంలో మునుగుతూ, తేలుతూ దూర తీరాలకు కొట్టుకుపోయే పూచీనంతా మాహెడ్‌మిస్ట్రెస్ గారికే అప్పగించి—"మన్నించండి, మేడం! నాకు క్లాసుంది. వెళ్ళివస్తాను" అంటూ పైకి లేచి చరచరా గుమ్మందాకా వచ్చేశాను.

"ఉండండి, మేడం! మాట. . ." అంటూ రమాబాయిగారు లేచి నా వెనువెంట వసారాలోకి వచ్చేసింది.

ఇంటర్వెల్ పూర్తిగావడంతో పిల్లలందరూ వాళ్ళ వాళ్ళ గదులకేసి వెళ్ళిపోతున్నారు. రమాబాయి నా చేయి పట్టుకుని ఒక స్తంభం చాటుకు తీసు కెళ్ళింది.

"మేడం! నా కోసం మీరొక పని చేయాలి. ."

"ఏమిటో చెప్పండి?" అన్నాను, విస్మయాన్ని తొక్కిపెట్టుకుంటూ.


"మరేం లేదు. పెద్ద అబ్లిగేషనేమీ గాదు. మా అమ్మాయి అనిత మీ క్లాసులో ఉందిగదండీ! దాని పక్కన అమ్మణ్ణి అంటూ ఒక పిల్ల కూచుంటుందట! ఆ పిల్లను వెనక డస్కుల్లోకి పంపించి ఆ తావులో శ్యామలా రాణిని కూచోబెట్టాలి. శ్యామలా రాణంటే తెలుసుగదూ! అడ్వొకేటు జగన్నాధరావుగారి కూతురు. ఏమిటో మరి! అమ్మణ్ణి అనే పిల్ల నంగనాచిలా ఉంటుందిట. గుడ్లు మిటకరించి చూస్తుందట. మంచి బట్టలయినా తొడుక్కోదట. మా అమ్మయి కా పిల్ల పొలకువే నచ్చడం లేదు. అందుకని చెబుతున్నా. నేను చెప్పినట్లు చేస్తారు గదూ? చేస్తారులెండి! థాంక్స్. . ."

నోరు తెరిచి ఒక మాట చెప్పే అవకాశమైనా నా కివ్వకుండా రమాబాయి వెళ్ళిపోయింది. నేను మాత్రం నిర్విణ్ణురాలినై నిల్చుండిపోయాను. ఆమె నన్నో పని చేయమని కోరింది. అందులోని సాధ్యాసాధ్యాలను గురించి గానీ, ఉచితానుచితాలను గురించి గానీ ఆలోచించుకోడానికి నా కెడమివ్వకుండా 'ఆఫ్టరాల్ టీచరువి! చెప్పినట్టు చేయకపోతే నువ్వు మెదిలే దెక్కడ?' అని సవాలు విసిరినట్టుగా ఆమె వెళ్ళిపోవడం తలచుకుంటే నాకు మతి పోతూంది. చదరంగంలో పావుల్ని మార్చవచ్చు. పేకాటలో చీటీలను గూడా ఎక్కడ ఇష్టమైతే అక్కడ పెట్టుకోవచ్చు. పాల డబ్బాలకోసం వచ్చే బీదజనంపైన దాష్టీకం చలాయించవచ్చు. కానీ తరగతి గదిలోగూడా అట్లాగే తన పెత్తనం కొనసాగాలనుకోడం ఏం సబబు? అక్షర క్రమాన్ని బట్టి మేము హాజరు పట్టీలో పిల్లల పేర్లు నమోదు చేస్తాం. ఆ మేరకు గదిలో వరుసగా కూచోపెడతాం. ఒక అమ్మణ్ణితో ఒక అనిత గొడవేర్పడినట్టు ఇప్పుడు రమాబాయి చెబుతూంది. వడ్ల గింజలో బియ్యపు గింజలాంటి ఈ వ్యవహారాన్ని ఇప్పటివరకూ పసిగట్టకపోవడం తరగతి పంతులమ్మగా నేను సిగ్గుపడవలసిన విషయం!

ఆలోచిస్తూ గదిలో కెళ్ళి నేను నా కుర్చీలో కూచున్నాను. క్లాసునంతా ఒకసారి కలియజూచా. ప్రత్యేకించి అమ్మణ్ణి వైపు చూశాను. ఆ పిల్ల ముఖంలో నాకు నంగనాచి లక్షణాలేవీ కానరావడం లేదు. లోకాన్నంతా వేలం పాటలో కొనగలిగేటట్టు డాబులు చెప్పుకునే ఆరిందలా దృష్టికి ఆ పిల్ల నంగనాచిలా కనిపిస్తుందేమో! అలా మాట్లాడేవాళ్ళ కేసి గుడ్లు మిటకరించి చూస్తుందేమో! పోతే మంచి దుస్తులేసుకోదన్న నేరం ఒకటుంది. లోకులందరూ మంచి ఇళ్ళల్లోనే ఉంటూ, మంచి తిండే తింటూ, మంచి దుస్తులే తొడుక్కునే మంచిరోజులకు మన మెంత దూరంలో ఉన్నామో తెలియదు. ఇందులో అమ్మణ్ణి తప్పుబట్టవలసిన పనేముంది? ఆ పిల్ల వాళ్ళకు కలిగినంతలో ఉన్న దుస్తుల్ని శుభ్రంగా ఉతుక్కునే తొడుక్కుంటుంది. రిజిష్టరులో అమ్మణ్ణిదే తొలి పేరు గావడం ముఖ్యంగాదు. చదువులో గూడా ఆ పిల్లదే ప్రథమ స్థానం గావడం విశేషం. అడిగిన ప్రశ్నకు చక్కగా జవాబు చెబుతుంది. కుదురుగా మున్యంలా కూర్చుంటుంది. నీటుగా నోట్సు రాసుకుంటుంది. సజావుగా హోంవర్కు చేసి చూపిస్తుంది. పాడమంటే ఇంపుగా పాడుతుంది. అనవసరంగా ఎవరితోనూ జోక్యం పెట్టుకోదు. వెకిలిచేష్టలు చెయ్యదు. అందరితోనూ స్నేహంగా ఉండడానికే ప్రయత్నిస్తుంది. ఇందులో నంగనాచితనంగా చెప్పుకోవలసిందేమీ లేదు. లేదంటే రమాబాయి అలా భావించడానికి మరొక బలీయమైన కారణం ఏదో ఉండి ఉండాలి. అదేమిటో వూహించడం కష్టసాధ్యమైన పనేమీ గాదు. అమ్మణ్ణి నరసయ్య కూతురు. నరసయ్య పగటి వేళల్లో తోటమాలి. రాత్రుల్లో వాచ్‌మాన్. మ్యునిసిపాలిటీ ఆధ్వర్యం క్రింద ఉన్న హైస్కూలు, ఎలిమెంటరీ స్కూలు సంయుక్తంగా నడుపబడుతున్న కాంపౌండులో ఒక చిన్న అవుట్ హౌసులో అతడి కాపురం. వాచమాన్ నరసయ్య కూతురు చదువుకుంటే చదువుకోనీగాక! క్లాసుకంతా ఫస్టొస్తుందా? మీదుమిక్కిలి తన తలదొక్కినట్టుగా తన కూతురు ప్రక్కనే కూర్చుంటుందా? పాపం రమాబాయి ఈ దురాగతాన్ని ఎలా సహిస్తుంది?

వారం పది రోజులు గడిచిపోయాయి. తరగతి గదిలో పిల్లలందరూ మామూలు ప్రకారం ఎవరి తావుల్లో వాళ్ళు కూర్చుంటున్నారు. మార్పు జరగలేదన్న వర్తమానం రమాబాయిపాలిటికి ఘోర పరాజయంలా తోచి ఉంటే అందుకు నేను చేయగలిగిందేమీ లేదు. ఆమె ఉండి ఉండీ తన హోదానంతా అచ్చేసిన కాగితంపైన—'నేను చెప్పిన విషయాన్ని గురించి ఏం చేశారు?' అంటూ ఒక ఉత్తరాన్ని అల్టిమేటంలా జారీ చేసింది. ఎంతగా నిగ్రహం వహించినా, ఆమె నన్ను రంగంలోకి రానీయడం ఖాయమని నా కనిపించింది. ముభావం వహించిన కొద్దీ ఆమె విజృంభిస్తుంది. అందుకని అదే కాగితం పైన ముక్తసరిగా 'సాధ్యం కాదు' అని రాసి పంపించేశాను.

ఇదంతా జరిగింది అక్టోబరు నెల ప్రారంభంలో. వివిధ పోటీలు, డ్రామా రిహార్సల్స్ నిర్వహిస్తూ నవంబరులో వచ్చే పిల్లల పండుగకోసం ఆయత్తం కావడంలో రమాబాయితో వచ్చిన గొడవను గురించి మరిచిపోయాను. మిగిలిన విద్యా సంస్థలలోకన్నా మా స్కూల్లో బాలల దినోత్సవం బాగా జరిగినట్టు పరిగణన రావాలన్నది మా హెడ్‌మిస్ట్రెస్‌గారి ఉబలాటం. అందుకోసమని ఆమె చాలా శ్రద్ధ తీసుకున్నమాట కూడా వాస్తవం. సబ్ జడ్జిగారు సభాధ్యక్షులుగా విచ్చేశారు. ఆయన సతీమణి బహుమతి ప్రదానం గావించింది. ఆ తర్వాత పిల్లలు చిన్న నాటికలు కొన్ని, డాన్సులు కొన్ని ప్రదర్శించారు. వినోద ప్రదర్శనాల్లో విశిష్టత నిరూపించుకున్న పిల్లలకుసైతం చిట్టచివర బహుమానాలు పంచి పెట్టబడ్డాయి. కార్యక్రమం జాతీయగీతంతో శుభప్రదంగా ముగిసింది—అంటూ చెప్పుకోడమే ఇంక తరువాయి. ఈ ఆఖరు ఘట్టంలో పదిమంది భద్ర మహిళల్ని వెంట బెట్టుకుని మన తెలుగు సినిమాల్లో ఇంటి కోడల్ని ఆరడి పెట్టే ఆడపడుచులా రమాబాయి స్టేజీపైకి వచ్చేసింది. "హెడ్‌మిస్ట్రెస్ ఎక్కడ? పి.ఇ.టి. ఎక్కడ? నాలుగో తరగతి టీచర్ ఎక్కడ? దమ్ములుంటే ఇక్కడికొచ్చి నాకు జవాబు చెప్పండి. మిమ్మల్ని అడిగేవా రెవరూ లేకపోయారా? స్కూలనేది అప్పటికి మీ సొంత రాజ్యమైపోయిందా? మీ స్కూలు వాచ్‌మాన్‌పై మీ కభిమానముంటే ఉండొచ్చు. అతడు మీరు చెప్పిన పనులన్నీ చేసి పెడుతున్నాడంటే, అందుకు వేరే బక్షీసులు ఇచ్చుకోవచ్చుగా! అయిన ప్రయిజులన్నీ అతని కూతురుకే దోచి పెడతారా? మా అమ్మాయిలు మీకు కొరగాకుండా పోయారా? ఏదో ఉత్సవమని పేరుబెట్టి, ఇంతమందిని ఇక్కడికి పిలిపించి ఇదేనా మీరు మాకు చేసే సన్మానం? ఇదంతా మీకు నవ్వులాటగా ఉందేమో! నే నూరుకునే దాన్ని గాను. ఉండండి, మీ పని చెబుతాను."



"అబ్బే, కాదండీ. రమాబాయిగారూ !నామాట వినిపించుకోండి. దయచేసి అపార్థం చేసుకోకండి. ." అని మా హెడ్‌మిస్ట్రెస్‌గారు బ్రతిమాలుకుంటూ వెంటబడుతున్నా వినిపించుకోకుండా రమాబాయి పరివార పరివేష్టితురాలై తారాజువ్వలా కాంపౌండు దాటి వెళ్ళిపోయింది.

మ్యునిసిపల్ ఆఫీసులో రమాబాయి మాటకు గల జరుగుబాటు మా కందరికీ విదితమే. పేరెంట్స్ అసోసియేషన్ తరఫున ఆమె కంప్లయింటు రాసి పడేస్తుంది. పై అధికారులు సంజాయిషీ చెప్పుకోవల సిందిగా మాకు నోటీసు లిచ్చేస్తారు. మా వాదాన్ని గూడా వినిపించుకోవాలన్న పట్టింపు వాళ్ళకుండక పోవచ్చు. అప్పు డిక మా గోడంతా అరణ్యరోదనమే. వార్నింగులు రావచ్చు. ఇంక్రిమెంట్లు కట్ గావచ్చు. సర్వీసు రిజిస్టరులో బ్లాక్ మార్కులు పడొచ్చు ఆ వచ్చే శ్రీముఖం ఎలా ఉంటుందో, ఏమిటోనని మా స్టాఫ్ మెంబర్లందరూ వూపిరి బిగపట్టుకుని బడికొస్తున్నారు.

ఆఖరు కొక రోజున ఆ కాగితం కాస్తా రానే వచ్చింది.

సంజాయిషీని డిమాండ్ చేస్తూ వచ్చిన నోటీసూ గాదు. ఎంక్వయిరీకి సిద్ధంగా ఉండమని చెప్పే హుకూమూ గాదు. అది ట్రాన్స్‌ఫరు ఆర్డరు.

ఆ బదిలీ గూడా టీచర్లకెవరికీ గాదు. హెడ్ మిస్ట్రెస్ కసలే గాదు. వాచ్‌మెన్ నరసయ్యకు!

రమాబాయి అక్కసు ప్రధానంగా నాపైన కేంద్రీకరించి ఉండవలసింది. ఆమె కేదైనా అపచారం జరిగిందంటే అది నరసయ్య మూలంగా మాత్రం గాదు. లేదంటే మునుపటికొక తోడేలు మేక పిల్లను తినేయడానికి చెప్పినట్టుగా, నరసయ్యను మార్పించ డానికి రమాబాయికి గల కారణాలు రమాబాయికి ఉండొచ్చు.


టవును కటూ చివర ఉన్న మ్యునిసిపల్ గెస్ట్‌హౌసుకు నరసయ్య బదిలీ చేయబడ్డాడు.

తాంబూలంలో అరటిపండ్లు పెట్టి తీసకొచ్చి అమ్మణ్ణి టీచర్ల దగ్గర సెలవు తీసుకుంది. నరసయ్య కాపురం గెస్ట్ హవుసుకు చేరువగా ఉన్న ఔట్ హవుసుకు మారింది. అతడు టి.సి. తీసుకెళ్ళి కుమార్తెను అక్కడికి దగ్గరగా ఉన్న బడిలో చేర్పించుకున్నాడు.

* * * *

సంవత్సరాలు గడిచిపోతున్నాయి. పిల్లలు ఒక క్లాసునించీ ఇంకొక క్లాసుకు మారిపోతున్నారు. స్కూల్లో ఎప్పుడైనా అనిత కనిపిస్తే, నాకు వెంటనే అమ్మణ్ణి జ్ఞప్తికొస్తుండేది. సురుల్ని తలుచుకోగానే అసురులు, నేలను చూడగానే నింగి, రాగం ప్రసక్తి రాగానే ద్వేషం తలుపుకు రావడం ఎంత విచిత్రం! అనిత, అమ్మణ్ణి ఇప్పుడు ఒక డెస్కులో లేరు. ఒక గదిలో లేరు. ఒక స్కూల్లో లేరు. అయినా, మానసిక ప్రపంచంలో మటుకు వాళ్ళిద్దరూ ఎప్పుడూ జంటగా కలిసే ఉంటారు. ఎంత మిస్టరీ అనిపించేది.

ఇటీవల మా బంధువు ఒకాయన హైదరాబాదు నుంచీ సకుటుంబంగా ఒక పెళ్ళికోసమని వచ్చి




మ్యునిసిపల్ గెస్ట్‌హౌసులో బస చేశాడు. వాళ్ళని సాగనంపడం కోసం నా కక్కడికి వెళ్ళి రావలసిన పని బడింది. వాళ్ళు కారులో బయల్దేరి వెళ్ళిపోయిన తర్వాత నేను తిరిగి రావడానికి సిద్ధపడుతుండగా ఎవరో పరుగెత్తి వస్తున్నట్లు తోచింది. పావడా చుంగులు పైకెత్తి పట్టుకుని పరుగెడుతూ పన్నెండేళ్ళ అమ్మాయి గస పోసుకుంటూ నా ఎదుట నిలబడిపోయింది.

"నమస్తే, మేడం! మే మిప్పుడుండడం ఇక్కడే. మా అమ్మ మిమ్మల్ని పిల్చుక రమ్మంది. అదే మా ఇల్లు. . ."

పిల్లలపైన వయ సెంత బాగా పని చేస్తుంది! పలకరించేదాకా అమ్మణ్ణని పోల్చుకోలేకపోయాను.

"రండి, టీచరమ్మగారూ! బాగున్నారా? కూచోండి" అంటూ నులక మంచం పైన సిరి చాప పరిచింది రత్నమ్మ. పిల్లలు త్రాగడం కోసం కడవలకు నీళ్ళు తెచ్చి పోస్తుండేది. ముఖ పరిచయమే గానీ, మాట్లాడుకున్నట్టు గుర్తు లేదు.

"అందరూ బాగున్నారు గదండి! పెద్ద మేడం గారు, హేమవతి మేడంగారు, సునందా మేడం..." అంటూ పేరుపేరునా క్షేమా లడిగి తెలుసుకుంది రత్నమ్మ. "ఉండండి, కొంచెం కాఫీ పుచ్చుకుని వెళ్దురుగానీ. . ." అంటూ నన్ను కదలకుండా కూచోపెట్టింది.

"అమ్మణ్ణి బాగా చదువుకుంటూందా?" అడిగాను.

"అంతా మీ దయ. ఏడో తరగతి పరీక్షలో గూడా స్కూలుకు ఫస్టొచ్చింది. అందుకని ఏదో డబ్బుగూడా ఇస్తామన్నారట. అయినా, మన స్కూలు వదిలి పెట్టి రావడమొక్కటేనండి దానికి బెంగ... వచ్చిన కొత్తలో పిలిస్తే పలికేదిగాదు. అన్నం సరిగ్గా తినేదిగాదు. రాత్రులో ఉండుండీ కలవరించేది. ఇప్పటికీ మిమ్మల్ని తలుచుకోని రోజు లేదంటే నమ్మండి. . "

నేను కాఫీ తీసుకుంటున్నాను. గుమ్మానికి ఆనుకుని నిల్చున్న రత్నమ్మ అడగడమా, మానడమా అని కొద్దిసేపు తటపటాయించిన తర్వాత ఒక నిర్ణయానికి వచ్చినట్లుగా తల పైకెత్తింది. "టీచరమ్మగారూ! అనితమ్మ ఎలా ఉందండీ? .బాగా పొడుగైందా? ఎనిమిదో క్లాసుకొచ్చేసింది గదూ?'

నాకేమీ అర్థంగాక అయోమయంగా రత్నమ్మ ముఖంలోకి చూస్తున్నాను.

"నాకు మా అమ్మణ్ణి ఎలాగో అనితమ్మగూడా అంతేనండీ! మా ఇంటాయన మునిసిపాల్టీ నౌకరీలో చేరకముందు మేము పాత కచ్చేరీ వీధిలో ఉండేవాళ్ళం. అప్పట్లో నేను చంద్రారావుగారింట్లో పని చేస్తుండేదాన్ని. . ."

"అలాగా? అయితే నీకు అనితని చిన్నప్పటి నుంచీ తెలుసన్నమాట!" అన్నాను.

"తెలీకేమండీ! మూడోనెల జరుగుతుండగా తల్లి దగ్గర పాల్లేకపోయాయి. డబ్బా పాలు పాప ఆరోగ్యానికి సరిపడక పోయింది. అప్పుడు అమ్మణ్ణికి ఆరో నెల. ఏడాది నిండేదాకా అనితకు గూడా నేనే పాలిచ్చాను. చెరొకవైపున తాగేవాళ్ళు. పక్కపక్కన పడుకోబెడితే అక్క చెల్లెళ్ళలా ఎంత ముద్దొచ్చేవారో! మన స్కూలు దగ్గరున్నప్పుడు రోజూ చూస్తుండే దాన్ని. ఇక్కడ కొచ్చాక ఆ ప్రాప్తం లేకపోయింది. టీచరమ్మగారూ! ఎప్పుడైనా • ఈవైపొస్తే మా ఇంటికొచ్చి వెళ్ళమని అనితమ్మతో చెప్తరూ? మూడేళ్ళయింది చూచి. బిడ్డ కళ్ళలో మెదిలి నట్లుంది. . ." చెమ్మగిల్లిన కళ్ళను చీర కొంగుతో తుడుచుకుంటూ అంది రత్నమ్మ.

గుండె గుడిలో గంటలు మ్రోగినట్టయి నా ఒళ్ళు పులకించిపోయింది. మాతృప్రేమ గూడా ఒక రకమైన స్వార్థం కాబోలు ననుకున్నాను. అది పాక్షిక సత్యం మాత్రమే. పూర్తి నిజంగాదు. అల్పజ్ఞురాల్ని. లెంపలేసుకుంటున్నాను. ★